# ఆలోచనలు

బి. రాజ్యలక్ష్మి



స్పందనం జీవలక్షణం అదే మనిషికి పశువులకు వున్న భేదం హృదయ స్పందనానికి ఆలోచన అత్యవసరం బహుశః ఆలోచన లేనిది మన మనుగడే లేదేమో! పుట్టిన ప్రతివారు యేదో ఒకనాడు గిట్టక మానరు. అలాగే యీ భూమిమీద పడ్డ ప్రతి మానవుడు ఆలోచించక మానడు. మనం నిత్య కృత్యాలు యెంత సహజంగా వొనరుస్తామో అలాగే మన జీవన సరళిలో ఒకభాగం ఆలోచన కాని ఆలోచనా విధానాలు పలు రకాలు సృష్టిలో ఒకరికి మరొకరికి బాహ్యంగా ఎంతో తేడా! భావాలలో ఎంతోతేడా. అలాగే ఆలోచన స్రవంతికూడా యేయిరువురిలో సమానంగావుండదు. హృదయస్థితిపై ఆలోచనాస్థితి ఆధారపడి వుంటుంది. పరిసరాల ప్రభావాలుకూడా ఆలోచనలపై పనిచేస్తాయి. ఆలోచనా పద్ధతిసక్రమమార్గంలో వున్ననాడు మన నిర్ణయాలు సత్ఫలితాలను యివ్వగలవు. దురాలోచనలనైనా దురాలోచనలతో ఆలోచించాలి.

ఈ ఆలోచనా వాహిని మనిషి వయస్సుతోబాటు అనేక మలుపులు తిరుగుతుంది. ఒక వయసులోని ఆలోచన మరో వయస్సులో మననం చేసుకుంటే మనలో మనకే యేదో తెలియని సిగ్గులాంటి భావంకాని జుగుప్సలాంటి భావంకాని ఆ విషయాన్ని అనుసరించి కలుగుతుంది. డైరీ మన ఆలోచనలకు ప్రతిబింబం కదా! ఒక సంవత్సరం వ్రాసిన డైరీని మరో సంవత్సరం చదివితే పాత ఆలోచనల గురించి కొత్త ఆలోచనలు మొలకెత్తుతాయి. ఇలా ఒక్క ఆలోచననించే ఎన్నో ఆలోచనలు మొదలవుతాయి.

పసిప్రాయంలో పిల్లలుఆలోచిస్తారు. వారి ఆలోచనలు చాలా తమాషాగా వుంటాయి. ప్రతి కథ నిజమని నమ్ముతారు. రాజకుమారుల వీరోచిత కార్యా

లకు లొంగిపోతారు. కాని ఆ పసి మనసులో యెన్నో సందేహాలు! వాటిని గురించి ఎన్నో ఆలోచనలు దయ్యాలు... భూతాల కథల వలన భయంకరమైన ఆలోచనలు. కలల్లో దయ్యాల గురించే ఆలోచనలు.

యవ్వనంలోని ఆలోచనలకు అంతే లేదు. యవ్వన దశలోనే విద్యాదశ కూడా వుంది. కాని యీ వయస్సులో వుద్భవించే ఆలోచనలే భావిజీవితానికి ప్రతిబింబాలు! మంచి ఆలోచనలైనా - చెడు ఆలోచనలైనా సాధారణంగా యీ వయస్సులోనే ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. మనసు మన ఆధీనంలో వుంచుకుంటూ.... మన పరిస్థితిని అర్థం చేసుకుంటూ ఆలోచిస్తే యేనష్టం లేదు. కాని మనం మానసిన బలహీనతలకు లొంగిపోయి ఏవో వెర్రి ఆలోచనలను ఆలోచించామంటే జీవితమంత బాధ పడాల్సివస్తుంది.

కొన్ని అలోచనలు అందరికీ చెప్పి నిర్ణయం తీసుకునేవిగా వుటాయి. ఎందు వల్లనంటే అందరి తెలివితేటలు, సునిశిత జ్ఞానం ఒక్కలా వుండవు. కొందరు కొన్ని ఆలోచనలను ఒకేకోణంలో ఆలోచిస్తారు. అది ఒక్కొక్క సారి వుపద్రవాన్ని కూడా తెచ్చిపెడ్తుంది. అలాంటి వారు కొందరితో కూడి ఆలోచన చేయాలి. అపుడు మన ఆలోచనా సరళిలోనే మరొక క్రొత్త ఆలోచన కలుగుతుంది.

ఈ విధంగా ఆలోచనల .... ఆలోచనలు ఎన్నో.... ! అంతవరకుఎందుకు? మనం ఒక కథ గాని ... ఒక వ్యాసం కాని వ్రాయాలనుకుంటాం .... సరే మూల వస్తువు ప్రాప్తించింది: ఆకథను ఎలా మొదలుపెట్టాలి .... ఎలా సాగించాలి.... ఎలా ముగించాలి.... యిది మన సమస్య ! ఎన్నో భావాలు ఎన్నో ఆలోచనలు.... కాని యీ పరిస్థితిలో ఆలోచించే విధానం మాత్రం చాలా తమాషాగా వుంటుంది. మగవారిలో అనేక రకాల భావ విన్యాసాలు, ఆడవారిలో అనేక రకాల భావ విన్యాసాలు కన్పిస్తాయి. కొందరు పురుషులు అదేపనిగా చైన్ స్మోకింగ్ చేస్తూ.... దృష్టిని శూన్యంలో నిలిపి ఆలోచిస్తారు కొందరు తలలోనికి రెండు చేతులు పోనిచ్చి జుట్టలతా పీకేసుకుంటూ వుంటారు. మా అన్నయ్య ఒకరు బాగా కథలు వ్రాస్తారు. ఆయన ఈతాకుల చాపపై కూర్చుని వ్రాస్తారు, ఆయన ఆలోచించేటప్పుడు అయ్యో పాపం ఆ చాప! అనిపిస్తుంది ఆ చాపనంతా పీకేస్తారు,

ఇలా చెప్పాలంటే ఎన్నో రకాలు ! అదే విధంగా ఆడవారు గూడా ఆలోచిస్తుంటే ఎన్నో గమ్మత్తులు.

కొందరు స్త్రీలు పాటలు వింటూ ఆలోచిస్తారు. మరికొందరు స్త్రీలు

మౌనంగా పడుకుని ఆలోచిస్తారు. నా మటుకు నాకైతే బట్టలుతుకుతుంటే .... అంట్లు తోముతుంటే ఆలోచనలు, అనేక కథలకు మూలం వస్తుంది. కాని అది అనువైన సమయం కాదే; ఆ పని మధ్యలో వదంలేమే ; కాని ఒక విషయం ; ఇలా అనేక కథలను ఆరంభించటం ... ముగించటం ... అలాంటి అంట్లు తోముతున్నప్పుడు చేస్తే అసలు ఆ పనిలో కష్టమే తెలియదు ; లేచి పని ముగిసి యివతలకు వచ్చేటప్పటికి... మరొక ఆలోచన ... అబ్బ .... యీ ఆలోచలనితో బుర్ర వేడెక్కి ఏ ఆలోచనలతో కథలు మొదలు పెట్టాలో తెలియదు. తీరా మొదలు పెట్టగానే మరో ఆలోచన .... బాప్ రే ... విసుగేస్తుంది .... పట్టు బట్టి కూర్చుంటే ఎన్నో ఆలోచనలతో ... అనుకున్నదొకటీ అయినది మరొకటిలా వుంటుంది ...

అసలు యిన్ని ఆలోచనలను మనం ఎందుకు ఆలోచిస్తున్నామా అని ఆలోచిస్తాను. మనలోని జ్ఞాన తృష్ణ పెరగడమే యిందుకు కారణమేమో ; విద్యాగంధం వలన ఎన్నో మంచి ఆలోచనలు. మన హృదయం నిర్మలంగా వుండాలంటే మనం మంచి విషయాలను గురించి ఆలోచించాలి. మంచి విషయాలు కావాలంటే మంచి సాంగత్యం... మంచి పరిసరాలు .... మంచి పుస్తకాలు అత్యవసరం.

చౌక బారు సాహిత్యం పఠిస్తే చౌక బారు విషయాలే ఆలోచిస్తాము.

ఈ విషయం అందరికీ వర్తించదు. కొందరు చౌకబారు సాహిత్యంలోని విషయాల నుండి ఎన్నో మంచి ఆలోచనలను చేయగలుగుతారు. యిలాంటివి మనసు పరిపక్వం చెందినవారే చేయగలరు.

మనం ఏ పని చేసినా ఆలోచించాలి. అందుకే పెద్దవారు కాని స్నేహితులు కాని మనకు ఏదైనా సలహా యిచ్చినప్పుడు "మీరుగూడా ఆలోచించండి. మళ్ళీ ఆలోచించండి" అంటారు. ఎవరెన్ని ఆలోచనలు చేసినా మనం గూడా మన ఆలోచనలు చేయాలి.

మన వూహకు అందని విషయాలను ఎన్నడూ ఆలోచించగూడదు. ఒక విధంగా వీటినే గాలిమేడలు అంటారు. ఈ గాలిమేడలు కూలినరోజున మనం తట్టుకోలేము.

ప్రతి విషయాన్ని తీవ్రంగా ఆలోచించరాదు. అదే మానసికంగా దెబ్బ తీస్తుంది. జీవితంలో ప్రతి వారికి అపజయాలు తప్పక ఎదురవుతాయి. కాని వాటినే ఆలోచిస్తూ వున్న సమయాన్ని గూడా దుర్వినియోగం చేయకూడదు. గతం గతమే ; భవిష్యత్తు వున్నది. ఆ భవిష్యత్తులో విజయం సాధించేందుకు ఆలోచించాలి. తగిన ప్రయత్నా

లకై ఆలోచించాలి.

ఇతరుల జీవితాల్ని గురించి ఆలోచించాలి. వారికి తగిన సాయం చేయటానికి ఆలోచించాలి. ప్రతిక్షణమూ బరువైన సమస్యలను గురించేకాక — ఉల్లాసకరమైన విషయాలను వుబుసు పోకకై ఆలోచించాలి.

ఆలోచనలు .... ఆలోచనలు...ఇలా ఆలోచనలు ... గురించి వ్రాస్తూవుంటే మరీ ఎన్నో కొత్త ఆలోచనలు.

బ్రతుకుబాటలోని ప్రతి మలుపు ఒక ఆలోచన ; భావిజీవితపు ప్రతిసోపానం ఒక ఆలోచన. నిరంతర చైతన్యం యీ ఆలోచనా స్రవంతి.

ప్రతివారు రంగురంగుల ఆలోచనలలో విహరిస్తారు. కాని కొందరే వారి రంగుల ఆలోచనలకు రూపురేఖలను దిద్ది బహిర్గతం చేయగలరు. తమ మనోభావాలను సమాజానికి తెల్పగలరు. వారే రచయితలు, రచయిత్రులు. ప్రతి రచన వెనుకా రచయిత హృదయం దాగి వుంటుంది. అది జగమెరిగిన సత్యం. ఒకవిధంగా ఆ రచయిత యొక్క ఆలోచనలను మనం గ్రహించగల్గుతున్నాము కొందరు రచయితల హృదయం...ఆలోచనలు వారి రచనలలో స్వచ్ఛమైన అద్దంలా ప్రతిబింబిస్తాయి. మరికొందరి రచనలలో ఏదో ఒక సన్నివేశంలో ఆ రచయిత యొక్క హృదయం తెలుస్తుంది. అందువలననే రచయి(త్రు)తలు ఆరోగ్యకరమైన. ఉల్లాసకరమైన స్వచ్ఛమైన ఆలోచనలనుచేయాలి. ఎందువల్లనంటే అది వారి కెరీర్‌కు సంబంధించిన విషయం.

"ఫేస్ యీజ్ ది యిండెక్స్" ఆఫ్ మైండ్ అన్న ఆంగ్లసామెత సత్యం ! ఏదైనా ఒకదానిని గురించి ఆలోచిస్తే అనుగుణంగా ముఖ కవళికలు మారిపోతాయి.

కాలేజి పిల్లలకు ఉదయం లేస్తూనే ఎన్నో ఆలోచనలు... ఎలాంటి డ్రస్ వేయాలి.... పెద్ద ఆలోచన ! ఎలాంటి హెయిర్ స్టెయిల్ చెయ్యాలి.... మరో పెద్ద ఆలోచన ఉద్యోగస్తులకు అందులోనూ సంసారులకు పిల్లలఫీజులు ఎలా కట్టాలో ఆలోచన.... ఆడపిల్ల ఎదిగి వుంటే ఆ అమ్మాయి పెళ్ళి గురించి ... ఆలోచన అంతవరకు ఎందుకు ? నెలాఖరు — రోజులైతే ఇంకా ఎన్నో ఆలోచనలు... చెప్పలేని ఆలోచనలు.... వాటిని నేను వ్రాయను.... ఎందువల్లనంటే వాటిగురించి వ్రాస్తూ వుంటే నాకు మరికొన్ని తలనొప్పివచ్చే ఆలోచనలు కలిగే ప్రమాదం వున్నది కనుక ! అయినా అవి మనకు తెలిసినవే కదా ?

పాఠకులారా... ఇలా ఆలోచనలను గురించి ఎన్నిపేజీలు వ్రాసినా.... ఇంకా ఏదో ఆలోచన... కాని మీరు చదివి ఆలోచించాలిగా ... నా వ్యాసం చదివి మీకు మరికొన్ని ఆలోచనలు కలిగి వుంటాయికదూ.... మరి వుంటాను.